# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర విద్యారంగంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వందేళ్ళుగా ముఖ్యపాత్రను పోషిస్తోందన్న గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.**

**2.** **రాష్ట్రంలోని ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్.**

**3.** **అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా భవన సముదాయాలను నిర్మిస్తున్నామని వెల్లడించిన మంత్రి పి.నారాయణ.**

**4.** **పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు సాంకేతిక-ఆర్థిక అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరిన మంత్రి నిమ్మల రామానాయుడు.**

**5.** **తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న కేంద్ర ఉక్కు పరిశ్రమ శాఖ మంత్రి హెచ్.డి కుమారస్వామి.**

===========================

రాష్ట్ర విద్యారంగంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వందేళ్ళుగా తనదైన పాత్రను పోషిస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 91, 92వ స్నాతకోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఆంధ్ర విశ్వ విద్యాలయం విజ్ఞాన ఘని అని పేర్కొన్నారు. వందేళ్ళ ప్రయాణంలో అనేకమంది విద్యావంతులను విశ్వ విద్యాలయం సమాజానికి అందించిందని తెలుపుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని రామతీర్థం పుణ్యక్షేత్రానికి 3.40 కోట్ల రూపాయలతో 3.70 కిలో మీటర్ల మేర నిర్మించిన గిరి ప్రదక్షిణ రహదారి ప్రారంభ కార్యక్రమాన్ని అమరావతి నుంచి దృశ్యమాధ్యమం విధానంలో ఉప ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా రామతీర్థం గిరి ప్రదక్షిణ రహదారి నిలుస్తుందని చెప్పారు.

గిరి ప్రదక్షిణ మార్గం ద్వారా రామతీర్ధం పర్యాటకంగానూ అభివృద్ధి చెందుతుందని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వైద్య-ఆరోగ్య రంగానికి పూర్తి స్థాయి సహకారం అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, ప్రతాప్‌రావు జాధవ్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ లతో మంత్రి సత్యకుమార్ ఈ రోజు వేర్వేరుగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పురోగతికి అవసరమైన అన్ని రకాల మద్దతు అందిస్తామని, కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా భవన సముదాయాలను నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న HOD టవర్ -3కు కార్నర్ నోడ్ ను అమర్చే పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, సచివాలయంతో పాటు ఐదు ఐకానిక్ టవర్లను నిర్మిస్తున్నామని, ఈ ఐదు టవర్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని చెప్పారు. అమరావతిలో అగ్ని ప్రమాదాల పై విచారణ జరుగుతుందని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

---------------------------

గోదావరి వరద జలాలను వినియోగించుకునేలా, పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు సాంకేతిక-ఆర్థిక అనుమతులు ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కేంద్ర జలశక్తి శాఖను కోరారు. పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వచ్చిన కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావుతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రి ఈరోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, వరదల కారణంగా ఏటా సగటున 3 వేల టిఎంసిల నీరు బంగాళాఖాతంలో కలసిపోతుందని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన డిజైన్లకు అనుమతులను మంజూరు చేయాలని కోరారు. గోదావరి, కృష్ణ, పెన్నా, వంశధార, నాగావళి వంటి నదుల ఏటిగట్ల పటిష్టతకు నిధుల సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని కేంద్ర ఉక్కు పరిశ్రమ శాఖ మంత్రి హెచ్.డి కుమారస్వామి ఈరోజు దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామి వారి తోమాల సేవలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయగా కుమారస్వామి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో... పండితులు ఆశీర్వచనం చేసి కేంద్రమంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

---------------------------

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని విజయవాడ ఇంచార్జ్ పోలీస్ కమీషనర్ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. విజయవాడలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, నగరానికి చెందిన మహమ్మద్ రహమతుల్లా షరీఫ్, మహమ్మద్ డానిష్ మీర్జా సాహెల్ అనే వ్యక్తులు తీవ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందని చెప్పారు. వీరిపై భారతీయ న్యాయ సంహిత –BNS ఉగ్రవాద వ్యతిరేక చట్టం –UAPA కింద కేసులు నమోదు చేశామని తెలుపుతూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తల ప్రాజెక్టుల పురోగతిపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేలా పెట్టుబడిదారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అమలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, ఇతర అనుమతుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

విజయవాడలోని సత్యనారాయణపురానికి చెందిన గాయని శ్రీలలిత ఆలపించిన భక్తి గీతాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గాదేవిని స్తుతిస్తూ ఆమె పాడిన "కనకదుర్గా మహా ప్రమావిత" పాట యూట్యూబ్ లింకును ప్రధానమంత్రి తన సామాజిక మాధ్యమం "ఎక్స్"లో పంచుకున్నారు. దుర్గాదేవిని ఆరాధించడం వల్ల మనసు అపారమైన శక్తిసామర్థ్యాలతో నిండిపోతుందని పేర్కొన్నారు. దీనిపై విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనాచౌదరి స్పందించి.. ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. విజయవాడకు చెందిన మహిళ పాడిన పాటను ప్రజలతో పంచుకోవడం నగరవాసులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

=====================